# ఎమర్జెన్సీ కాకున్నా సైరన్!

**-చిన్నచిన్న కారణాలకే మోగిస్తూ దూసుకెళ్తున్న అంబులెన్స్‌లు**
**-అత్యవసర సమయాల్లోనే సైరన్ వాడాలంటూ సూచన**



హైదరాబాద్, జూలై15 ప్రభాతవార్త
రోగికి అత్యవసర సమయంలో వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం రూట్ క్లియర్ ఇస్తుంటారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో చాలా సందర్భాల్లో అత్యవసర సమయం కానప్పుడు కూడా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్లు వాడుతూ వెళ్తున్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం రోగిని ఇంటికి తీసుకెళ్లే సమయంలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు ఉద్యోగులు వివిధ రకాల శాంపిళ్ల కలెక్షన్లు, మృతదేహాలను తరలించేటప్పుడు ఇలా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్‌ను ఉపయోగిస్తున్నట్లు తేలింది. అత్యవసర సమయాల్లోనే సైరన్‌ను వాడాలని దుర్వినియోగం చేయవద్దని డ్రైవర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ సర్వీస్‌లకు సంబంధించిన సైరన్‌ను ఎలా వాడుతున్నారు.. దాని దుర్వినియోగంపై ఒక సర్వే చేశారు. ఇందుకు గత నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ మధ్యలో అక్కడక్కడ జంక్షన్ల వద్ద 310 అంబులెన్స్ సేవల గురించి ఆరా తీశారు. అందులో అత్యధికంగా 152 అంబులెన్స్‌లు (49 శాతం) శాంపిళ్లను తీసుకొని వెళ్తున్నవే ఉన్నాయి. అలాగే వివిధ కారణాలు చెప్పినవి 121 (39శాతం), మృతదేహాలను తీసుకెళ్తున్నవి 20 (6.5శాతం), ఖాళీగా వెళ్తున్నవి 17 (5.5శాతం) ఉన్నట్లు తేలింది. ఇలా సగానికిపైగా అంబులెన్స్‌ల సైరన్లు దుర్వినియోగం అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ అందరి సహకారంతో అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరముంటుంది. అయితే ఆ రోగికి అత్యవసరం కాకున్నా అంబులెన్స్ ఉందంటే సైరన్ వేసుకొని వెళ్లేవారు చాలా మంది ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే.. అప్పుడే పుట్టిన పసి పాపలు.. ఇలా కొన్ని సందర్భాల్లో తప్పని సరిగా అంబులెన్స్ సైరన్ వాడాల్సిందేనని పోలీసులు సూచిస్తున్నారు.రోగి చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఇంటికి వెళ్తుండడం,మృతదేహాలను తరలించడం, అనారోగ్యంగా ఉన్న వారిని, ఉద్యోగులు, వివిధ రకాలైన శాంపిళ్లను తీసికెళ్లే సమయం లోనూ అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని నగర ట్రాఫిక్ అధికారులు సూచనలు చేస్తున్నారు.

### ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు..

అంబులెన్స్ సైరన్‌తో వెళ్తుంటే రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు జంక్షన్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ ఇస్తుంటారు. ఆటోమెటిక్ వ్యవస్థ ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు సిగ్నళ్లను మాన్యువల్‌గా మార్చేసి అంబులెన్స్‌లకు దారిస్తుంటారు. ఇలా ఒక గంటలో ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఆటోమెటిక్ నుంచి మాన్యువల్ మోడ్‌కు సిగ్నల్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని అంబులెన్స్‌లు నాన్ ఎమర్జెన్సీ సందర్భాల్లోనూ సైరన్ మోగిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు సర్వే ద్వారా గుర్తించారు.అయితే కొందరు ప్రైవేటు వైద్య సంస్థలు తమ సొంత ప్రచారాల కోసం ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాల్లో తమ అంబులెన్స్‌లను తిప్పుతున్నట్లు తెలుస్తోం ది. అంబులెన్స్‌లో రోగులు లేకున్నా..సైరన్ మో గిస్తూ రద్దీ సమయాల్లో తిప్పుతూ స్వార్థ ప్రచారం పొందుతున్నారు. ఒక కార్పొరేట్ సంస్థ ఇలాగే సైరన్ మోగిస్తూ వాహనదారులను అదరగొడుతూ రద్దీ రోడ్లపై దూసుకెళ్లుండగా చివరకు పోలీసులకు పట్టు పడడం.ఆపై వత్తిళ్లతో తప్పించుకోవడం గమనార్హం.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ బాహీ బాహీ

**-బోనాలు చెక్కులు పంపిణీలో గందరగోళం**
**-దేవాలయంలో బట్టలు చినిగేలా కొట్టుకున్న వైనం**
**-ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో గొడవ**
**-ఇరు వర్గాలుపై కేసులు నమోదు చేసిన పోలీసులు**



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు



చినిగిన బట్టలుతో బిఆర్ఎస్ నేత రాము యాదవ్

**అల్వాల్, జూలై 15 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉప్పు నిప్పులా ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల రాజకీయ వైరం పరాకాష్టకు చేరింది. దేవాలయంలో బట్టలు చినిగేలా కొట్టుకోవడం సంచలనంగా మారింది. సాక్ష్యాత్తు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో దాడులు ప్రతి దాడులు జరగడం తో పోలీసులు ఉలిక్కిపాటుకు గురయ్యా రు. ఇరు వర్గాలను చెదరగొట్టడానికి లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేత లక్ష్మీకాంత్ రెడ్డి, కార్పొరేటర్ సునిత రాము యాదవ్ భర్త రాము యాదవ్‌కు ఒంటిపై ఉన్న బట్టలు చినిగి పోయిన పరిస్థితి. బోనాలు చెక్కులు పంపిణీకి రెండు పార్టీలకు చెందిన నేతలను ఒకే వేదికపై తీసుకుని రావడమే పెద్ద తప్పిదంగా మారింది. మంగళవారం దేవుని అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వరా ఆలయంలో చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇరు పార్టీలకు చెందిన కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తును ఆలయానికి చేరుకున్నారు. ఒక విధంగా తమ బల ప్రదర్శన చేయడానికి వచ్చినట్లుగా అక్కడి పరిస్థితి కనిపించింది. చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన వేదికపై అధికార పార్టీ నేతలు ఆశీనులు కావడం వివాదానికి కారణంగా మారింది. ప్రొటోకాల్ ప్రకారం వేదికపై కుర్చీలు లేకపోవడం పట్ల అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఈ విషయమై ఇరు పార్టీల మధ్య జరిగిన మాటలు చినికి చినికి గాలి వానగా మారింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటుగా పోలీసులు సముదాయించే ప్రయత్నం చేశారు. సమావేశం వద్ద ఉద్రిక్తత పెరుతున్న నేపథ్యంలో పోలీసులు సూచనతో చెక్కులు పంపిణీ నిలిపివేశారు. సమావేశ మందిరం నుంచి ఆలయం ప్రధాన ద్వారానికి వెళ్ళే క్రమంలో కాంగ్రెస్ నేత లక్ష్మీకాంత్ రెడ్డిని బిఆర్ఎస్‌కు నేతలు తోయడం జరిగింది. కోపోద్రిక్తులైన కాంగ్రెస్ శ్రేణులు ఎదురు తిరిగాయి. బిఆర్ఎస్ నేత రాము యాదవ్‌తో పాటుగా ఇతరులుపై కాంగ్రెస్ శ్రేణులు పిడిగుద్దులు కురిపించారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో రాము యాదవ్‌ను వారి నుంచి రక్షించగలిగారు. అప్పటికే ఆయన బట్టలు మొత్తం చినిగి పోయాయి. ఇరు వర్గాలుపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

### అభివృద్ధి, సంక్షేమం రాజకీయాలులో ముఖ్యం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ప్రజా సంక్షేమం కోసం పోటీతత్వంతో రాజకీయాలు ఉండాలి తప్ప కక్షలులో సాధించేది ఏమీ ఉండదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బోనాలు చెక్కులు పంపిణీ సందర్భంగా జరిగిన వివాదంపై ఆయన మీడియాతో ముచ్చటించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఉదంతం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కార్పొరేటర్లు పట్ల అనుచితంగా మాట్లాడడం సమంజసం కాదని తెలిపారు. ప్రొటోకాల్‌ను ప్రశ్నించి నందుకే వివాదం రాజుకుందన్నారు. బోనాలు సందర్భంగా ఆలయాలకు అదనపు నిధులు సమకూరే విధంగా కాంగ్రెస్ నేతలు ప్రభుత్వంతో పోరాడాలని సూచించారు. కార్పొరేటర్ సునిత రాము యాదవ్ భర్తపై దాడి చేయయం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దౌర్జన్యాలుతో అభివృద్ధి జరగదని నిర్మాణాత్మక చర్చలు, సహకారం ద్వారానే మంచి ఫలితాలు సాధ్యమని తెలిపారు. విభిన్నమైన వ్యక్తులు అభిప్రాయాలకు గౌరవం ఇవ్వాలని కోరారు. రాజకీయ నాయకులు ప్రజా సంక్షేమం కోసం పాటు పడాలి తప్ప గొడవలుతో ఏమి సాధించలేరన్నారు.

# పెరిగిన ట్యాంకర్ బుకింగ్‌లు

**-36శాతం మేర పెరిగిన డిమాండ్**
**-ట్యాంకర్ల డెలివరి , ఇంకుడు గుంతల మీద దృష్టి సారించాలి**
**-అధికారులకు ఆదేశించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త :** గత కొన్నిరోజులుగా ట్యాంకర్స్ బుకింగ్స్ పెరగడంతో.. ట్యాంకర్ బుకింగ్ డెలివరీ మీద దృష్టి సారించాలని ఎండి అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గత మూడు సంవత్సరాలుగా సకాలంలో వర్షాలు పడకపోవడం.. ఈ ఏడాది జూలై 3వ వారమైన సమృద్ధిగా వర్షాలు లేకపోవడంవల్ల.. చాలా ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో ట్యాంకర్ బుకింగ్‌లు గత ఏడాదికంటే 36 శాతం పెరిగిందని, అలాగే డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని, దానికనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

### ట్యాంకర్ డిమాండ్, సరళి...

జలమండలి పరిధిలో దాదాపు 1135 ట్యాంకర్లు ఉన్నాయి. వీటిద్వారా రెండు షిఫ్టులలో ప్రజలకు నీరు సరఫరా జరుగుతుంది. నగరంలో ప్రధానంగా 6 డివిజన్లలో(6,15,9,18,22,10 డివిజన్లు) రోజూ బుకింగ్ అయ్యే ట్యాంకర్లలో అధిక శాతం ఇక్కడినుండే వస్తున్నాయి. ఫిల్లింగ్ స్టేషన్‌లు 88 ఉండగా. మొత్తం 140 ఫిల్లింగ్ పాయింట్స్ ఉన్నాయి. గత ఏడాది జూలై 1 నుంచి 14 తేదీ నాటికి. 63,724 ట్యాంకర్ల డిమాండ్ ఉండగా, ఈ సంవత్సరం జూలై 14 నాటికి 86,520 ట్యాంకర్లను వినియోగదారులు బుకింగ్ చేసుకున్నారు. ఇది గత ఏడాదికంటే 36 శాతం అధికంగా ఉంది.

### ఇంకుడు గుంత తప్పనిసరి..!

జలమండలి పరిధిలో దాదాపు 14 లక్షల కనెక్షన్లు ఉండగా కేవలం 42 వేల గృహాలే ట్యాంకర్ బుక్ చేసుకుంటున్నారు. అందులో 500 మంది.. వేసవి 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు బుక్ చేసుకున్నారు. 22 వేల మంది 90 శాతం ట్యాంకర్లను అంటే 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేసుకున్నారు.దీంతో జలమండలి వారి గృహాల్లో సర్వే చేసి.. వారికి ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించారు. దాంతో వారందరికీ ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేసి, 90 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలాగా అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. అలాగే, ఇప్పటివరకు 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధిలోని 300 గజాల పైన ఉన్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని.. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ సందర్భాలలో పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని సైతం హెచ్చరించారు. ఇంకుడు గుంతలు లేని వారికి ట్యాంకర్ రేటు పెంచడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. వచ్చే నెల రోజుల్లో అలాంటి వారి జాబితాను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ జలయజ్ఞంలో అందరూ భాగస్వామ్యం కావాలని ఎండి విజ్ఞప్తి చేసారు.

హైదరాబాద్ వార్త



# విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్,జూలై 15,ప్రభాతవార్త:
విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక తర్ఫీద్ అందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని గిరిజన సంక్షేమ శాఖ వాటర్ స్పోర్ట్స్ అకాడమీ, ఆశ్రమ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు వాళ్ల అభిరుచి మేరకు క్రీడల్లో ప్రత్యేక తర్ఫీద్ అందించి దేశ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వం విద్యతోపాటు క్రీడాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లు చేపట్టాలని, విద్యార్థులకు తరుచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా తరగతి గదుల్లో బ్యాక్ బెంచ్ లేకుండా యు ఆకారంలో బెంచీలను ఏర్పాటుచేసి మెరుగైన విద్య బోధన అందేలా చూడాలని అన్ని తరగతి గదుల్లోనూ ఇదే తరహాలో ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ద్వారా సాంకేతిక విద్యపై అవగాహన కల్పించాలని సూచించారు. పదవ తరగతిలో గతంకంటే మెరుగ్గా ఫలితాలు ఉండాలని విద్యార్థులు ఇష్టంతో చదవాలని సూచించారు. అలాగే మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో వెనుకంజలో ఉన్న పిల్లలకు ఇప్పటినుండి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల గ్రూప్ గా ఏర్పడి విద్యకు సంబంధించిన అంశాలపై చర్చించుకుంటూ ఒకరికి ఒకరు సహకారం అందించుకోవాలన్నారు. అలాగే వసతి గృహం, పాఠశాల గదులతోపాటు పిల్లల వాష్ ఏరియా, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఫిలిప్పీన్స్ దేశంలో ఎం. స్రవంతి, సంజయ్, ప్రభాకర్ డ్రాగన్ బోటింగ్ క్రీడలో పాల్గొని సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి అంతర్జాతీయ స్థాయిలో నిలిచినందుకు విద్యార్థులను అభినందించారు. తదుపరి ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల విద్యా బోధన, మెనూ ప్రకారం అందుతున్న ఆహార పదార్థాలు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతి గదులను పరిశీలించి మెరుగైన విద్యాబోధన అందాలని, ఉత్తీర్ణత ఫలితాలు నూటికి నూరు శాతం ఉండాలని అన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన టి సతీష్ అనే అభ్యర్థిని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, ప్రిన్సిపల్ అముక్తమాల్యద, వార్డెన్ ఎం నీలిమ, ప్రధానోపాధ్యాయుడు లాల్, ఉపాధ్యాయులు,స్పోర్ట్స్ టీచర్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బకాయిల వసూలకు స్పెషల్ డ్రైవ్

**-బకాయిదారుల ప్రాంగణాల్లో నోటీస్ బోర్డుల ఏర్పాటు**
**-సిఎండీ ముషారఫ్ ఫరూఖీ**



హైదరాబాద్,జూలై 15,ప్రభాతవార్త:
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, మొండి బకాయిల వసూలుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. దానిలో భాగంగా బిల్‌స్టాప్ట్ హెక్టా సర్వీస్ కలిగి ఉన్న ప్రాంగణాల ముందు తమకు రావాల్సిన బకాయిల మొత్తం పేర్కొంటూ నోటీసు బోర్డులను ఏర్పాటు చేసింది. సంస్థ తీసుకుంటున్న ఈ చర్యల వల్ల బకాయిలు వసూళ్లు ఆవుతున్నాయని సిఎండీ ముషారఫ్ ఫరూఖీ ఒ్రపటనలో తెలిపారు. ప్రస్తుతం,సంస్థ పరిధిల్లో 728 బిల్ స్టాఫ్ట్ హెచ్ కనెక్షన్లు ఉన్నాయనీ, ఆసర్వీసులు ఇప్పుడు వాడకంలో లేవన్నారు. వీటికి సంబంధించి రూ.600 కోట్లు బకాయిలు ఉన్నాయనీ, బిల్లుల వసూలుకు సంబందించి ఎన్నిసార్లు వారికి సంప్రదించినా ఎలాంటి మార్పు లేకపోడంతో ఈచర్యలకు పూనుకున్నామన్నారు. అలాగే 9.19 లక్షల బిల్ స్టాప్ట్ హెచ్ఐటీ సర్వీసుల నుంచి దాదాపు రూ.188 కోట్లు రావాల్సి ఉన్నదన్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.100 కోట్లు వసూలయ్యాయని తెలిపారు.విద్యుత్ శాఖకు బకాయిపడ్డ విషయం తెలియకుండా కొంతమంది ఆ సర్వీసుకు సంబంధించిన ఆస్తులు కొనుగోలు చేస్తున్నారని, యాజమాన్యం మారినా ఆబకాయిలు చెల్లించనిదే విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదని పలు చట్టాలు పేర్కొంటున్నాయని, అలాంటి ఆస్తులు కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.ఇప్పటికే విద్యుత్ శాఖకు రావాల్సిన బకాయిల వివరాలను, వాటికి లింక్ చేయబడ్డ అస్తుల సమాచారాన్ని రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు అందజేసినట్టు తెలిపారు. దీనికితోడు జిల్లా కలెక్టర్లకు కూడా బకాయిల వివరాలను అందజేశామని తెలిపారు.

# చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి బంగారు బోనం సమర్పణ



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి బంగారు బోనం సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయాల కమిటీల ప్రతినిధులు

చార్మినార్,జూలై 15 ప్రభాతవార్త :
ఆషాడ మాస బోనాల ఉత్సవాలు సందర్భంగా మంగళవారం సప్త మాతృకలకు సప్త బంగారు బోనం సమర్పణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భాగ్యనగర్ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్ ఆధ్వర్యంలో చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి బంగారు బోనం సమర్పించారు.హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం జోగిని అవికా దేవి తలపై బంగారు బోనంను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమనమ వారికి సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఊరేగింపు కమిటి ప్రతినిధులు శ్రీధర్,శ్రీకాంత్,వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులు డి.ప్రభాకర్,మధుసూదన్ యాదవ్,హన్స రాజ్,రవీందర్ చారి,దత్తాత్రేయ, రామ్‌దేవ్ అగర్వాల్,శ్రీనివాస్,సతీష్,ఆర్.అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

# శాకాంబరి దేవిగా దర్శనమిచ్చిన బల్కంపేట ఎల్లమ్మ



సంజీవరెడ్డి నగర్,జూలై 15 ప్రభాతవార్త: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలోని మూల విరాట్ అమ్మవారిని ఆషాడమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, ఫలములతో ఎంతో సుందరంగా శాకాంబరిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అ సౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈఓ మహేందర్ గౌడ్, ఆలయ చైర్మన్ ఎసాయిబాబా గౌడ్,సూపరిండెంట్ హైమావతి, ఆలయ సిబ్బంది, నూతన పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# అనుమతి లేని కమర్షియల్ షెడ్డు సీజ్

**అత్తాపూర్ జూలై15,ప్రభాతవార్త :** అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ షెడ్డు అధికారులు సీజ్ చేశారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్‌లో గ్యాన్ చంద్ అనే వ్యక్తి మూసి నది రోడ్డు పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా భారీ ఎత్తున కమర్షియల్ షెడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధిత యజమానికి నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసిన ఆయన స్పందించలేదు. మున్సిపల్ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణం పూర్తి చేయడానికి యత్నించాడు. డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు మంగళవారం టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో కమర్షియల్ షెడ్డును సీజ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.



షెడ్డును సీజ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీధర్

## తిలక్‌నగర్‌లో వైద్య శిభిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు




తిలక్‌నగర్‌లో వైద్య శిభిరాన్ని ప్రారంభించిన కాలేరు వెంకటేశ్

**హైదరాబాద్, జులై 15 ప్రభాతవార్త:** కేర్ హాస్పటల్ సహకారంతో మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఉచిత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అవస రమైన ఆరోగ్య సేవలను అందించడమే ఈ ఆరోగ్య శిభిరం లక్ష్య మని చెప్పారు. ఈ శిభిరంలో వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నరేష్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొని రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, ప్రదీప్‌రావు, విజయ్‌సాగర్, శరత్, మూర్తి, నరే ంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు అధికారులను కలిసిన అసోసియేషన్ ప్రముఖులు



ఎస్ఎస్ఎస్‌పిడిఎస్ డైరెక్టర్లను కలిసిన తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**చిక్కడపల్లి, జులై 15 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖలో తెలంగాణ సథరన్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టిఎజిఎస్‌పిడిఎల్ డైరెక్టర్లుగా నియమితులైన డైరెక్టర్(ఫైనాన్స్) పి. క్రిష్ణ రెడ్డి, డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్.నరసింహులు, డైరెక్టర్ (ప్రాజెక్ట్) వి.శివాజీ, డైరెక్టర్(ఆపరేషన్స్) వి.చక్రపాణిలను మంగళ వారం తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మంగళవా రం కలిసి ఘనంగా సత్కరించి అభినందించింది. కాంట్రాక్టర్ల అసోసియేషన్ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్తు లైసెన్స్ బోర్డు పూర్వ సభ్యుడు పి.సదానంద్ గౌడ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ముఖ్యకార్యదర్శి ఎస్‌కె.మాజీద్, సంయుక్త కార్యదర్శి సంజయ్‌కుమార్, ముఖ్య సలహాదారు బిక్షమయ్య, ఫారిద్, ఎన్‌పిడిఎల్ అధ్యక్షుడు ఎస్‌కె. జలీల్, కొత్తగూడెం నుంచి ఈసాక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, సురేష్, శంకర ప్ప, మిర్యాలగూడ నుండి కిరణ్ కుమార్ రెడ్డి, గుండు శ్రీను, కార్యనిర్వాహక కార్యదర్శి యన్.పర్వతాలుతో పాటు వివిధ డివిజన్, సర్కిల్ నుండి భారీ ఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత



పేద విద్యార్థిని జ్యోత్స్న ఇంజనీరింగ్ విద్యను చదివేందుకు ఆర్థిక సహాయం చేస్తున్న మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి.

**నార్సింగి, జులై 14 ప్రభాతవార్త :** గత దశాబ్దకాలంగా మణికొం డ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి అనేక మంది పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం తన సొంత డబ్బులు వెచ్చిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతిభ ఉండీ కూడా పేదరికం కారణంగా ఉన్నత చదువులకు దూరం అవుతున్న వారిని గుర్తించి ప్రతీఏటా ఇంటర్, ఇంజనీరింగ్ విద్యార్థులను చదివిస్తూ మానవతావాదిగా మారారు. ఈ సంవత్సరం జ్యోత్స్న అనే విద్యా ర్థిని ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి 964.వ,ర్యాంకును సాధించి వివిఎన్ ఆర్ కళాశాలలో ఇంజనీరింగ్ సీటును పొందింది. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న రామకృష్ణారెడ్డి ఆ విద్యార్థిని వద్దకు వెళ్లి తక్షణ సాయంగా రూ.25.వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గత పదేళ్ల నుంచి ఉడతా భక్తిగా నావంతు చేయూతనందిస్తున్నానని వివరించారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకారం ఇవ్వడంలో ఎనలేని సంతృప్తిని కలుగుతుందన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిపడ్డ వారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరింత మంది ముందుకు వచ్చి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అండగా నిలువాల్సిన అవసరం ఉందని రామకృష్ణారెడ్డి పేర్కొన్నా రు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుద్దోలు శ్రీరాములు, ఏర్పు ల కుమార్, లక్ష్మీశ్రీ, శ్రవణ్ కుమార్, భానుచందర్ పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధంగా 42శాతం బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలి : మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి




పాల్గొన్న రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి

**చిక్కడపల్లి, జులై 15 ప్రభాతవార్త:** రాజ్యాంగబద్ధంగా 42శాతం బిసీలకు రిజర్వేషన్‌లను అమలు చేయాలని రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే వేళ అలా చేయని పక్షంలో వివిధ రూపాలలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం వి.శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రామ్‌నగర్ నుంచి ఇందిరాపార్కు వద్ద బిఆర్ఎస్ పార్టీ నిర్వహించతలపెట్టిన బిసిపిఎఫ్ సమావేశంలో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో బయలు దేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కల్వగోపి, సిరిగిరి శ్యామ్, రాజూయాదవ్, ఎర్రం శేఖర్, కార్తీక్‌యాదవ్, శివ, అజ్జు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## లాల్‌దర్వాజ సింహవాహిని, శ్రీ మహంకాళి అమ్మవారికి జిహెచ్‌ఎంసి ఉద్యోగులు,సిబ్బంది బోనాలు సమర్పణ



**యాకుత్‌పుర, జులై 15 ప్రభాతవార్త :** లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారికి సంతోష్ నగర్ సర్కిల్ జిహెచ్‌ఎంసి సిబ్బంది మంగళవారం బోనాలు సమర్పించారు.ఆలయ కమిటి చైర్మన్ మారుతి యాదవ్ సాదరంగా వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెం కన్న,గౌలిపుర డివిజన్ కార్పొరేటర్ అలె భాగ్యలక్ష్మీ,డిప్యూటీ కమిష నర్లు మంగతాయారు,ఎల్.సరిత జిహెచ్‌ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో ఎస్సి, ఎస్టి దాడులపై సిఎం నేతృత్వంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

**సైఫాబాద్, జులై 15 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోజురోజు కు ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, నివార ణ చర్యలు తీసుకోవాలని ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమ ంత్రి, ఇతర మంత్రులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెం కటయ్య చెప్పారు. ఇందుకు స్పందించిన సిఎం త్వరలోనే ఒక సమావేశాన్ని ఏరా ్పటు చేసి తగిన చర్యలు చేపడతా మని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు దేవాల యాలతో సమానమని, దేశంలో కొన్ని పార్టీలు మతంపే రిట పాఠశాలల్లో దాడులు కొనసాగిస్తున్నాయని, వీటిని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకు దేశంలో ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్, ఎబివిపి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నా యని, దళిత, గిరిజన, ముస్లింలను టార్గెట్ చేస్తున్నా యని ఆరోపించారు. జై శ్రీరాం అనే నినాదంతో అలజ డులు సృష్టిసు ్తన్నాయని చెపా ్పరు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా బూర్గుపల్లి ఉన్నత పాఠశాలలో మత ద్వేషాలను రెచ్చగొడుతూ గిరిజన టీచర్ నరేందర్‌నాయక్‌పై బిజెవై ఎం దుండగులతో దాడి చేయించిన సోషల్ టీచర్ మను వాది రవిబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బిజెవైఎం దుండగులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే కోటగిరి గ్రామంలో తెలుగు టీచర్ మల్లికార్జున్, తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో రాములుపై దాడి చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత, గిరిజన నాయకులు వెంకటేష్‌చౌహాన్, రాజేష్‌నాయక్, ఆశ శ్రీరాములు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకు అతీతంగా మున్నూరుకాపు వర్గం ముందుకు సాగాలి

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




మున్నూరుకాపు ఓరియంటేషన్ శిక్షణ సదస్సులో ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్,ఎమె ్మల్యే ఆది శ్రీనివాస్

**శేరిలింగంపల్లి, జులై 15 ప్రభాతవార్త :** కులమతాలకు అతీతంగా మున్నూరుకాపు సామాజిక వర్గం ముందుకు సాగితేనే రాజకీయ మనుగడ సాధ్య మవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజకీయ పార్టీల తరహాలో మున్నూరు కాపులకు ఓరియంటేషన్ శిక్షణ తరగతులను నిర్వహించటం హర్షనీయమన్నారు. చందానగర్ లోని సుప్రజ గార్డెన్స్‌లో మంగళవారం మున్నూరు కాపు సామాజిక వర్గ ఒక్కరోజు ఓరియంటే షన్ శిక్షణ తరగతుల సదస్సు జరిగింది. ఈ సదస్సు కు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సర్ధార్ పుటం పురుషోత్తం రావు పటేల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్,వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీల తరహాలోనే మున్నూరు కాపులు ఓరియంటేషన్ శిక్షణ తరగతను నిర్వహించటం శుభపరిణామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. మున్నూరు కాపుల నాయకత్వం గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. ఆత్మగౌరవ భవనం కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన 5కోట్ల రూపా యలు తిరిగి మున్నూరు కాపు భవనం నిర్మాణం కోసం వెచ్చించేలా కృషిచేస్తామన్నారు. అదే విధంగా మున్నూరు కాపులు పేరు చివరన పటేల్ అని వచ్చేలా గెజిట్‌ల నమోదు అయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చా రు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్ధార్ పటం పురుషోత్తం రావు పటేల్ మాట్లాడుతూ.. రాజకీ యాలకు అతీతంగా మున్నూరు కాపుల సంక్షేమం కోసం సంఘం నిర్మాణం ఉంటుందన్నారు. వామ పక్షాలు తది తర పార్టీల తరహాలో మున్నూరు కాపులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించటం మున్నూరుకాపు సంఘా నికే గర్వకారణమన్నారు. టీఎస్పీసీసీ మాజీ సభ్యులు విటల్, జలమండలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, రౌతు కనకయ్య, మున్నూరు కాపుల విద్యావంతుల వేదిక రా ట్ర అధ్యక్షులు మల్లికార్జున్ ప్రబ్బదులు ఓరియంటేషన్ శిక్షణ తరగతులలో వివిధ అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, అపెక్ ్స కమిటీ సభ్యులు గాలి అనిల్‌కుమార్, మీసాల చంద్రయ్య, తూడి ప్రవీణ్, సంఘం రా ష్ట్ర ప్రధాన కార్య దర్శి పెద్ది పెంటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బుక్క వేణుగోపాల్, డాక్టర్ జేఎన్ వెంకట్,చల్లా హరిశంకర్, మహిళా వింగ్ ప్రెసిడెంట్ బండి పద్మ, కోశాధికారి సత్య నారాయణ,ఉపాధ్యక్షులు వాసాల వెంకటేశ్వర్లు, రాష్ట్రం లోని ఆయా నియోజక వర్గ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్య క్షులు,ప్రతినిదులు పాల్గొన్నారు.

## ముష్కిన్ చెరువులో మురుగు కలవడంపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం

### - నిబంధనల మేరకే అందరూ నడుచుకోవాలని ఆదేశం
### - మురుగునీరు ఎక్కడి నుంచి వస్తుందో ఏరియల్ సర్వే ద్వారా గుర్తిస్తాం



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ముష్కిన్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**నార్సింగి, జులై 15 ప్రభాతవార్త :** మణికొండ మున్సి పాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువులో మురుగు నీరు కలువడంపై హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మణికొండ మున్సిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి రంగనాథ్ ముష్కిన్ చెరువును సందర్శించారు. ఈ చెరువులో అడ్డగోలుగా చెత్త, మట్టిని నింపుతున్నారని, డ్రైనేజి నీటిని చెరువులోకి మళ్లిస్తున్నారని హాల్‌మార్క్ విసినియా, మైహోమ్ అవతార్ గేటెడ్ కమ్యునిటీలకు చెందిన కొతమంది సోమవారం హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ, ఓ నిర్మాణ సంస్థ ల ప్రతినిధులు కొన్ని రోజులుగా ముష్కిన్ చెరువులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టరని, అభివృద్ధి పేరుతో చెరువు పరిధిని తగ్గిస్తూ వస్తున్నారని కమీషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరి ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా కమీషనర్ ముష్కిన్ చెరువును సందర్శించి, అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగు తున్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఏమి చేసినా నిబంధనలకు లోబడే చేయాలని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్ట పరిధిలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. 52.ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో కేవలం 12.ఎకరాలలోనే అభివృద్ధి ఎందుకు చేస్తున్నా రని? ఈ చెరువులోకి మురుగు నీరు ఎందుకు కలుస్తుంద ని? ఇరిగేషన్ శాఖ అధికారులను నిలదీశారు. ఎవరైనా సరే ఇష్టానుసారంగా కట్టలు నిర్మిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ చెరువులోకి మురుగునీరు ఎక్కడి నుంచి వచ్చి చేరుతుందో ఏరియల్ సర్వే చేయించి, గుర్తి స్తామని, చెరువులోకి మురుగు నీరు రాకుండా చూస్తా మని రంగనాథ్ స్థానికులకు తెలిపారు. చెరువు ఎఫ్టీఎల్ లో పోసిన మట్టిని, ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామ ని హా మీనిచ్చారు. చెరువు గేటు ముందు పోసిన మట్టిని వెంటనే తొలగించాలని, డ్రైనేజి నీరువులోకి రాకుండా పనులు ప్రారంభిస్తామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ వివరించారు.

## జిహెచ్‌ఎంసిలో ఘనంగా బోనాల ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తదితరులు

**హైదరాబాద్, జులై 15 ,ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించే బోనాల పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధా న కార్యాలయంలో అంగరంగ వైభవంగా బోనా ల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తొట్టెల ఊరేగింపు కార్యక్ర మంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొన్నా రు. ఊరేగింపులో భాగంగా కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకున్న మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మా ట్లాడుతూ... బోనాల పండుగ మన సంస్క ృతిని, సమైక్యతను ప్రతిబింబిస్తుందని మున్సి పల్ ఉద్యోగుల భాగస్వామ్యంతో జరుపుకునే ఈ ఉత్సవం అందరికీ స్ఫూర్తిదాయకం" అన్నా రు. ఈ కార్యక్రమంలో పలువురు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, అధికారులతో పాటు యూనియన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నృత్య గురువులకు జీవనోపాధి కల్పించాలి : అనూహ్య రెడ్డి




కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనూహ్యరెడ్డి, పిఎన్.మూర్తి, భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

**చిక్కడపల్లి, జులై 15 ప్రభాతవార్త:** నృత్య గురువుల నుంచి కూడా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహా కమిటీ సభ్యు లుగా చేర్చాలని కోవిద ఆర్ట్స్,కల్చరల్ అకాడమీ అధ్యక్షురాలు డా: పి .అనూహ్య రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్ లింగం పల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం, కోవిద ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా నిర్వ హించిన నృత్య గురువుల సమస్యలపై సమాలోచన సభాకార్య క్రమం తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డా: పి .అనూహ్య రెడ్డి మాట్లాడుతూ నృత్య గురువులకు భారత దేశం లో విశేషమైన స్థానం ఉందని, అటువంటి గురువులకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం సంక్షేమం లేదని అన్నారు. శాస్త్రీయ సంగీత నృత్య అకాడమీ ఏర్పాటు చేయాలని, తెలంగాణలో సాంస్కృతిక సచివాలయం కల్చరల్ సెక్రటేరియట్ ఏర్పాటు చేయాలని, తెలంగాణలో ప్రతి జిల్లాలో ఆడిటోరియల్ పునరుద్ధరించాలని, ప్రతి బడిలో ఒక నృత్య టీచర్ ఉండాలని కళాకారులకు కల్చరల్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాలయాలు పర్యాటక శాఖలు సాంస్కృతిక కళాక్షేత్రాలు అన్నిట్లో నృత్య గురువులకు అవకాశాలు కల్పిం చాలని, నృత్య గురువులందరికి రవీంద్రభారతిలో అందరికీ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని గురువుల తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నృత్య గురువులు రమణి సిద్ధి ఇందిరా పరాశరం చిన్న జీయర్ స్వామి పవన్ డాన్స్ మాస్టారు తెలుగు వెలుగు శ్రీరామ్ దట్టి సీనియర్ జర్నలిస్టు సుమన్ సామాజికవేత్త సురేష్ గౌడ్ అనుదీప్తి ,హిందూమతి, రాధిక శ్రీనివాసులు, లావణ్య, రామలక్ష్మి ్మ, తదితరులు పాల్గ్గొన్నారు. కోవిద ఆర్ట్ అండ్ కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షు రాలు అయిన అనుహ్యారెడ్డికి గౌరవంగా అభినందనలు తెలియజేశారు.

## డా. బి.వి.పట్టాభిరామ్ వ్యక్తికాదు సామూహికశక్తి : డా. కె.వి.రమణాచారి



పట్టాభిరామ్‌కు నివాళులర్పిస్తున్న రమణాచారి, ప్రశాంత్, శ్రీనాథ్, వంశీరామరాజు, మల్లంరమేష్, జెన్నీ, రాజు తదితర ప్రముఖ కళాకారులు

**రవీంద్రభారతి, జులై 15 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత సైకాలజిస్టు, మెజీషియన్ డా. బి.బి.పట్టాభిరామ్ ఒక వ్యక్తికా దు, సామూహిక శక్తి అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహా దారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. పట్టాభిరామ్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన కుటుంబసభ్యులు, శిష్యులు కొనసాగించాలని సూచించారు. మ్యాజిక్, మిమిక్రీ, మైమ్ కళాకారులు బి.వి.పట్టాభిరామ్ జ్ఞాపకాలను మననం చేసుకుంటూ తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యువ తెలంగాణ మెజీషియన్స్ అసోసియే షన్, హైదరాబాద్ మెజీషియన్, తెలుగు మెజీషియన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు జి.వి.ఎన్.రాజు అధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన పట్టాభిరామ్ సంస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి పట్టాభిరామ్ చిత్రపటానికి పు ష్పాంజలితో ఘననివాళులర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించి మాట్లాడారు. సైకాలజీ రంగాన్ని అత్యున్నతస్థాయికి తీసుకువెళ్లడంతోపాటు మ్యాజిక్, మిమిక్రీ, మైమ్‌రంగాలను అనుసంధానం చేయడానికి డా. నేరెళ్ళ వేణుమాధవ్, డా. బి.వి.పట్టాభిరామ్‌లు సంయుక్తంగా తోడ్పాటు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ళ వేణుమాధవ్ కుమారుడు నేరెళ్ళ శ్రీనాథ్, పట్టాభిరామ్ కుమారుడు భావరాజు ప్రశాంత్, సీనియర్ పాత్రికేయుడు జ్వాలా నరసింహారావు, సాంస్కృతిక సంస్థల అధిపతులు వంశీరామరాజు, సత్కళాభారతి సత్యనా రాయణ, సీనియర్ మెజీషన్‌లు వెంకటరమణ, విశ్వనాథ్ జోషి, డా. బి.ఎన్.ఎస్.కుమార్, అలీ, ప్రదీప్, రంగ్రేజ్, రామడుగు వసంత్, శ్రీరంగం, ప్రవీణ్, మిమిక్రీ అసోసియన్ అధ్యక్షుడు జి.వి.ఎన్.రాజు, నటుడు లోహిత్, మల్లం రమేష్, గజల్ వినోద్, రఘుబాబు, మైమ్ కళాకారులు జెన్నీ, మధు తదితరులు పాల్గొని పట్టాభిరామ్‌కు ఘననివాళులర్పించారు. చివరగా తమ తండ్రి ఆశయాన్ని ఆయన శిష్యుల సహకారంతో ముందుకు తీసుకువెళ్లానని కుమారుడు భావరాజు ప్రశాంత్ స్పష్టం చేశారు.

## స్వామి వివేకానందనగర్ బస్తి వాసులకు త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు : కార్పొరేటర్



ఆర్డీవోను సమావేశమైన గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జులై 15 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద నగర్ బస్తి వాసులకు త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తి లోని 19 పేద దళిత కుటుంబాల ఇళ్లను గత ఏడాది ప్రభుత్వ అధికారులు నిర్ధా క్షిణ్యంగా కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఏడాదిన్నరగా పేదలకు పునరావాసం కల్పించేందుకు ఆలస్యం ఎందుకు జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ పావనీ వినయకుమార్ ఆర్డీఓ పి.సాయి రామ్‌ను ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బస్తి వాసులతో కలిసి ఆర్‌డిఓతో సమావేశ య్యారు. ఇళ్ల కేటాయింపు కు కావలసిన వివరాలను, ఎంఆర్ఓ, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలలో అందచేసి కూడా 15 నెలలు కావొస్తుందని, ఈ విషయంపై కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఎం.పి రాజ్యసభ డా"కె.లక్ష్మ ణ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలని సూచించారని వివరిం చారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసిన సందర్భంలో త్వరలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆదేశాలు జారీ చేశామ న్నారని, నిరక్ష్యం చేయకుండా వెంటనే బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూ లంగా స్పందించిన ఆర్ డి ఓ ఇళ్ల మంజూరు పూర్తి అయ్యిం దని, త్వరలో కుటుంబాల వారిగా కేటాయింపు ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. సమీక్షలో బస్తి వాసులు ఎం. బి.కృష్ణ, జ్ఞానేశ్వర్,ఆనంద్ రావు. తదిత రులు పాల్గొన్నారు.

## లోకకళ్యాణార్థం 'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం'



'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం' కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్, జులై 15 ప్రభాతవార్త:** ధూపదీప నైవేద్య అర్చక సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షి స్తూ లోకకళ్యాణార్థం 'పంచకుండాత్మక చండీ, కుబేర పాశుప త యాగం' కార్యక్రమం మంగళవారం భక్తి శ్రద్దలతో నిర్వహిం చారు. కాచిగూడలోని తుల్జాభవన్ ధర్మశాలలో యాగ నిర్వా హకులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ, కర్మణ, పుణ్యాహవాచనం, మూలమంత్ర అనుష్ఠాన ములు, ప్రధాన మంటప దేవత హోమాలు, నవగ్రహ హోమం, రుద్ర, చండీ, కుబేర పాశుపత హోమం, సహస్ర నామ పుష్పార్చన, నీరాజన మంత్రపుష్పం, బహుపరాకులు, చతుర్వే ఆశీర్వచనము, భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్ర మం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్ది ళ్ళ శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవ ర్గం ఇంచార్జ్ కోట నీలిమ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్.వెంకట రా వు,కరీంనగర్ మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయ శర్మ, సం ఘం గౌరవ సలహాదారు డాక్టర్ పోతులపాటి రామ లింగేశ్వర శర్మ,అధికార ప్రచార కార్యదర్శి కృష్ణ మాచార్యులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, జులై 15, ప్రభాతవార్త**

బౌరంపేట సబ్ స్టేషన్ నుండి ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 13:00 వరకు వెలువడే 11కేవీ కోకాకోలా ఫీడర్, 11కేవీ జున్నమ్ ఫీడర్లలో సింహపురి కాలనీ, నెక్స్ విల్లాస్, గోకుల్ బృందావన్, కె ఎల్ విశ్వవిద్యాలయం, డి ఆర్ కె ఇంజనీరింగ్ కళాశాల, డాలర్ డ్రీమ్స్, మై స్పేస్1, ఎస్బిఐ కాలనీ, సాయి కృష్ణ కాలనీ, రాయల్ విలేజ్, లహరి ఎస్టేట్, ఇందిరమ్మ కాలనీ బహదూర్ పల్లి ఎస్ఎస్ నుండి 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్‌లో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 13:00 వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, విశ్వకర్మ కాల నీ, అయ్యప్ప సొసైటీ, సూరారం ప్రధాన రోడ్డు, సూరారం గ్రామం ప్రాంతాలు బౌరంపేట ఎస్ఎస్ నుండి 11కేవీ కేవీఆర్ ఫీడర్ లో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ వుడ్ విల్లాలు, నేచర్ బౌంటీ విల్లాలు, స్టెల్లింగ్ హోమ్స్, జేఎన్ఎస్ విల్లాలు, శంబిపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని బౌరంపేట ఏఈబి సాయికిరణ్ ఒక ప్రకటనలో కోరారు.

**బాచుపల్లిలో..** 11 కేవీ సాయి నగర్ ఫీడర్‌లో నేడు ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు సాయి నగర్, రామ కృష్ణ ఎన్క్లేవ్, ఆర్జీకే, ఆదిత్య గార్డెన్స్, డబుల్ బెడ్ రూములు అలాగే 11 కేవీ మా విల్లాస్ ఫీడర్ లో మధ్యాహ్నం 02:00 నుండి సాయంత్రం 05:00 వరకు మా విల్లాస్, గు ల్మోహర్, కౌసల్య కాలనీ. ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉం డదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి



**యూసుఫ్‌గూడ, జులై 15, ప్రభాతవార్త :** ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల బస్తీల కాలనీలలో పాద యాత్రలు నిర్వహించి సమస్యలు తెలుసుకోవటం జరుగు తుందని జుబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజారుద్దీన్ అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ బస్తీలో బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి పర్యటిం చారు. బస్తీలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలో ప్రజ లు పలు సమస్యలతో సతమతమౌతున్నారని వాటన్నిం టిని త్వ రగా పరిష్కరించి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా చూస్తామన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వ మని అన్ని వేళల ప్రజా సమక్షేమం కోసం కృషి చేయటం జరుగుతుంని ప్రభుత్వం తరపున పథకాలు అర్హులైన ప్రతి పేద వాడికి అందేలా చూసే బాధ్యత నాయకులు కార్యకర్తలపై ఉందన్నారు.

## గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి దేవాలయ హుండీ ఆదాయం రూ. 3 లక్షల 70 వేల 152



శ్రీ జగదాంబికా మహంకాళి దేవాలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు.

**మెహిదీపట్నం, జులై 15, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి దేవాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. బోనాల ఉత్సవాల లో భాగంగా ఇప్పటివరకు ఆరు పూజలు నిర్వహించగా 5వ, 6వ పూజకు రూ. 3లక్షల 70 వేల 152 రూపాయల హుండీ ఆదా యం వచ్చిందని ఆలయ ఈవో చిందెల్ల వసంత తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు ఎరుకల సంతోష్ కుమార్ గౌడ్, ఎన్.శ్రీకాంత్, డి. అనిత, ఎస్. గిరి, ఆర్.నర్సింగ్ రావు, కె.శంకర్, ఆర్.సర్వేశ్‌చారి, బి. సురేష్ చారి, దేవాదాయ శాఖ అధికారి నరేష్, దేవాలయ వృత్తి పని వారి సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్‌లు పాల్గొన్నారు.

## చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

**కొంపల్లి, జులై 15, ప్రభాతవార్త**

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ తురక చెరువులో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాచుపల్లి పోలీసులు, డిఆర్ఎఫ్ సిబ్బంది కథ నం ప్రకారం మంగళవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో 100 నెంబర్‌కి నిజాంపేట తురకచెరువు సమీపం లోని స్థానికులు ఫోన్ చేసి తురకచెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహం తేలియాడుతూ కనిపిస్తుందంటూ సమాచారం అందించారు. దీంతో బాచుపల్లి పోలీసులు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ ఎఫ్) సిబ్బంది సంఘటన స్థలమైన తురకచెరువుకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. మృతిచెందిన యువకుడికి సుమారు 30 నుండి 35 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నల్ల ప్యాంటు తెల్ల షర్టు ధరించి ఉన్నాడు. నల్ల రంగు చెప్పులను మృతుడు కలిగియు న్నాడు. మృతదేహంపై ఎలాంటి దెబ్బలు గాని కత్తిపోట్లు గాని ఇతరత్రా అనుమానాస్పద గాయాలు ఏమీ లేవు. దీంతో మృతుడు ఆత్మహత్య కైనా పాల్పడి ఉంటాడని లేదంటే ప్ర మాదవశాత్తు చెరువులో పడి మరణించి ఉంటాడని బాచుపల్లి పోలీసులు భావిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే బాచుపల్లి పోలీసులకు గాని, 100 నంబర్‌కు గాని సమాచారం అందించాలని బాచు పల్లి పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు బాచుప ల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన భర్త..

**జగద్గిరిగుట్ట, జులై 15, ప్రభాతవార్త**

ఓ వ్యక్తి ఫుల్‌గా మద్యం సేవించి భార్యకు ఫోన్ చేసి నేను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన సంఘటన జగద్గిరిగు ట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.స్వప్న, నర్సయ్య (34) భార్యభర్తలు. వీరు జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో నర్సయ్య డ్యూటి కోసం వెళ్తున్నానని చెప్పి ద్విచక్ర వాహనం (టిఎస్07 ఈఈ3213)పై బయటికి వెళ్ళాడు. అయితే మధ్యాహ్నం సుమారు 1:15 గంటల ప్రాంతంలో స్వప్నకు ఫోన్ చేసి తిడుతూ, తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. మళ్ళీ ఫోన్ చేయగా అతని ఫోన్ స్విచ్ఆఫ్ అని వస్తుంది. తెలిసిన వారిని, బంధువులను అడిగిన ఆచూకి లభించకపోవడంతో స్వప్న జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, జూలై 15, ప్రభాతవార్త**
పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం కొలన్ హన్మంత్‌రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### బోనాలు సమర్పించిన ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి


బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

**నిజాంపేట్, జూలై 15, ప్రభాతవార్త**
నిజాంపేట్ గ్రామం జర్నలిస్ట్ కాలనీ చెరువులో వెలసినటువంటి అతి పురాతన ఆలయం శ్రీ చర్ల ఎల్లమ్మ తల్లి ఆలయం నందు అమ్మవారికినిజాంపేట్ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి బోనాలు సమర్పించడం జరిగింది. నిజాంపేట్ ప్రజలు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, మహేష్ యాదవ్, శ్రీ వీణ, నాగరాజు యాదవ్, విన్ను నిజాంపేట్ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### డిప్యూటీ సిఎం భట్టిని కలిసిన పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్


డిప్యూటీ సిఎంభట్టివిక్రమార్కతో రత్నాకర్‌రావు, సదానందం, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:**
డిప్యూటీ సిఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టివిక్రమార్కను తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కలిసింది. ఈమేరకు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షులు రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ సదానందంల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పలుఅంశాలపై చర్చించారు. ఈసందర్భంగా నల్గొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ ప్లాంట్ కు చెందిన 800ఎండబ్ల్యూ యూనిట్‌వన్ కమర్షియల్ ఆపరేషన్ డేట్ డిక్లరేషన్ దిగ్విజయంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. అలాగే పవర్ సెక్టర్‌లో ట్రాన్స్ఫర్ పాలసీని ఇవ్వాలని కోరగా వెంటనే స్పందించి రెండు రోజుల్లో పాలసీ ఇస్తామని తెలిపారు. డిప్యూటీ సీఎంని కలిసిన వారిలో జెన్కో ఎన్.సురేష్ కుమార్ ట్రాన్స్‌కో సెక్రెటరీ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

### 42 శాతం రిజరేషన్‌ల పట్ల బిసి జాతి అప్రమత్తంగా ఉండాలి : పాండుయాదవ్



**సైఫాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే 42 శాతం రిజర్వేషన్‌ల ఆర్డినెన్స్ పట్ల బిసి జాతి అప్రమత్తంగా ఉండాలని బిసి కులాల ఐక్య వేధిక రాష్ట్ర అధ్యక్షుడు పాండుయాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి వెనక్కి తీసుకోకుండా ఖచ్చితంగా రిజర్వేషన్‌లను అమలు చేయాలని, లేని ఎడల ప్రభుత్వ తీరును ఎండగడతామని ఆయన హెచ్చరించారు. ఎన్నికలకు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాలు పోను మిగిలిన అన్ని స్థానాల్లో బిసిలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని, ఇందుకు గాను ప్రచారానికి, ఇతరత్రా విషయాల్లో సహాయ సహకారాలను అందిస్తూ తమ ఐక్యవేదిక వెన్నంటే ఉంటుందన్నారు. ముఖ్యంగా 60 శాతం ఉన్న బిసిలు తమ ఓట్లను బిసిలకు వేసి రాజ్యాధికారాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ వినయ్‌కుమార్ శివశంకర్ మాట్లాడుతూ బిసిలు అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారం ద్వారానే సాధ్యమని, రాజ్యాధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిసిలకు బిసిలే శత్రువలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రిజర్వేషన్‌ల ద్వారానే అభివృద్ధి చెందలేమన్నారు. ఈ సమావేశానికి వేధిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొక్క కాశీనాథ్‌ముదిరాజ్ అధ్యక్షత వహించగా ప్రముఖ బిసి నాయకులు సత్యనారాయణ, వి.జి.ఆర్.నారగోని, సంధ్యా రాణి పాల్గొన్నారు.

### బోరబండ ఆషాఢ బోనాల ఉత్సవాలకు మంత్రులకు ఆహ్వానం


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్.

**యూసుఫ్‌గూడ, జూలై 15, ప్రభాతవార్త :**
తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ఆశాఢ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ మాజీ ఉప మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా బోరబండ దేవాలయ కమిటీతో కలిసి పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, కార్మికశాఖ మంత్రి వివేక్, తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ అజారుద్దీన్‌ను కలిసి వేడుకలకు ఆహ్వానించారు.

## ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

### -కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కి మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదిల్‌షరీఫ్, చంద్రశేఖర్, రాజిరెడ్డి, గాంధీ తదితరులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:**
జీహెచ్‌ఎంసీలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్స్ కార్మికులతో పాటు పర్మినెంట్ ఉద్యోగులకు చెందిన దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఐఎన్టీయూసీ గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ నేతలు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో నేతల బృందం కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ముఖ్యంగా జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లతో పాటు సూపరింటెండెంట్ పోస్టుల్లో పని చేస్తూ, ఏళ్ల నుంచి అర్హత కల్గిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయాన్ని ఎవరూ పట్టించుకోవటం లేదని, కనీసం వారికి పదోన్నతులకు ఇప్పటికైనా మోక్షం కల్గించాలని కోరినట్లు వెల్లడించారు. కొద్ది నెలల క్రితం పదోన్నతుల కోసం జాబితాను తయారు చేసి, విజిలెన్స్ క్లియరెన్స్ కోసం పంపించారని, ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోయిందని వివరించారు. ముఖ్యంగా గత సర్కారు ఏర్పడినప్పటి నుంచి దాదాపు పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఔట్ సోర్స్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని కేవలం ప్రకటన చేసి, కాలయాపన చేసిందని, కనీసం ఇప్పటి సర్కారైనా కార్మికుల సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. హెల్త్ కార్డు పరిమితి రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని కోరుతూ పలు సార్లు వినతి పత్రాలు సమర్పించిన విషయాన్ని కూడా కమిషనర్‌కు గుర్తు చేశారు. శానిటేషన్ విభాగంలో ముఖ్యమైన విధులు నిర్వహిస్తున్న కార్మికుల్లో అత్యధిక సంఖ్యలో మహిళా కార్మికులే ఉన్నారని, వీరిలో మెజార్టీ కార్మికులకు సిటీలో సొంత ఇండ్లు లేక, వచ్చిన జీతంలో సగం అద్దెలు చెల్లిస్తూ అవస్థల పాలవుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించి, ఇప్పటికే వృథాగా పడి ఉన్న జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇండ్లను శానిటేషన్ కార్మికులకు కేటాయించే విషయాన్ని పరిశీలించాలని కోరారు. యూనియన్ వినతికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ తన పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించనున్నట్లు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఉన్నందున, వాటిని సర్కారు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కమిషనర్ ను కలిసిన యూనియన్ నేతల్లో యూనియన్ జనరల్ సెక్రటరీ ఆర్. డీ. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రాజ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఏవీఎస్ గాంధీ తదితరులున్నారు.

### కాంగ్రెస్ అగ్రనాయకులకు క్షీరాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

**నిజాంపేట్, జూలై 15, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్స రెడ్డి భూపతి రెడ్డిల ఆదేశాల మేరకు మంగళవారం ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ల చిత్రపటానికి బాచుపల్లి గ్రామ పరిధిలో ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాలాభిషేకం చేశారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి గ్రామంలో కాలనీవాసులతో కలిసి పలు రోడ్లు పరిశీలించి, త్వరలోనే రోడ్లుకు తగిన పునరుద్ధరణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బల్ రెడ్డి, ఏ. శంఖర్, జీతయ్య, జిత్తు, రాము, టిల్లు, సంజు, రాజు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు ఇవే ...

**సికింద్రాబాద్, జూలై 15 ప్రభాతవార్త:**
ఫీడర్‌ల నిర్వహణ పనుల కారణంగా విద్యుత్తు శాఖ సీతాఫల్‌మండి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు సెక్షన్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు చిలకలగూడ పోచమ్మ టెంపుల్ 11కేవీ ఫీడర్ పరిధిలోని మైలార్‌గడ్డ, బొందలగడ్డ, మసీద్ ఏరియా, కిందిబస్తీ, వెస్లీచర్చి ప్రాంతం, గీతా నర్సింగ్ హోమ్ వీధి, దూద్‌బావి, చింతబావి, చిలకలగూడ ప్రధాన మార్గం, శ్రీదేవి సినిమా థియేటర్ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**సీతాఫల్‌మండి 11కేవీ ఫిడర్ పరిధిలో...**
మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు సీతాఫల్‌మండి 11కేవీ ఫిడర్ పరిధిలోని దత్తాత్రేయ టెంపుల్, జోషీ కాంపౌండ్, ఎస్‌వీఎస్ ప్రాంతం, ప్రగతి స్కూల్ ప్రాంతం, మోర్ సూపర్ మార్కెట్ ప్రాంతం, డిబిఆర్ వెనకాల ప్రాంతం, చిలకలగూడ ప్రధాన రోడ్డులో సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రఫోల్ రామ్‌రెడ్డి

**సైఫాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినప్పటికి ఇచ్చిన హామీలలో 250 గజాల స్థలం, పెన్షన్ తదితర డిమాండ్లను అమలు చేయాలని జెఎసి నూతన కార్యవర్గం కోరింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రపోల్ రామ్‌రెడ్డి, కళ్ళెపు చంద్రశేఖరప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల తమ జెఎసి కార్యవర్గం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యదర్శులుగా బకారం లావణ్య, ఎ.వి. రావు, ఉపాధ్యక్షులుగా దుండిగల అంజయ్య, సుధామల అంజలి, కాంపల్లి సాయిలు, లక్ష్మీకాంతమ్మ, కార్యనిర్వాహక అధ్యక్షులుగా పి.తుల్జారెడ్డి, మంచాల వెంకటస్వామి, మార్వాడి సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆంజనేయస్వామి, కోశాధికారిగా హరిప్రసాద్, ముఖ్య సలహాదారులుగా బి.రంగారెడ్డి, ఎ ం.శంకర్‌రావు, అన్వర్ పటేల్, గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఎన్నికైనారని వారు వివరించారు.


మణికొండ మున్సిపాలిటీలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరుతున్న మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి తదితరులు.

### లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆహ్వానం


బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆహ్వానం పత్రిక అందజేసిన ఆలయ కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జూలై 25 ప్రభాతవార్త :** చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంలో జూలై నెల 20వ తేదీన జరగనున్న బోనాల ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు ఆలయ కమిటి చైర్మన్ మారుతి యాదవ్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్‌లు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి కోశాధికారి ఎ.చంద్ర కుమార్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్, దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, వినోద్ రెడ్డి, అంజనారెడ్డి, శ్యాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

### పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు


బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దేవాలయం కమిటి ప్రతినిధులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై14 ప్రభాతవార్త :** దూద్‌బౌలి ఉందా బజార్ శ్రీ పైనీరు ముత్యాలమ్మ దేవాలయంలో అత్యంత వైభవంగా జోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నామని ఆలయం కమిటి చైర్మన్ డి.ఆనంద్ గుప్తా తెలిపారు. బోనాల జాతర ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటి చైర్మన్ ఆనంద్ గుప్తా మాట్లాడుతూ 20వ తేదీన అమ్మ వారికి అభిషేకం, పూజ, బోనం సమర్పణ, 21వ తేదీన అమ్మవారి ఘటం ఊరేగింపు మందిరం నుంచి ప్రారంభమై ఢిల్లీ దర్వాజకు చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పైనీరు ముత్యాలమ్మ ఆలయం కమిటి అధ్యక్షులు వెంకటాచలం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కట్టా నరసింహరావు, ఆలయ కమిటి ప్రతినిధులు శ్రీనివాస చారి, సంతోష్ గుప్తా, సుధాకర్, రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

### యూసుఫ్‌గూడ సర్కిల్ 19 ఉప కమిషనర్‌గా రజినీకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**యూసుఫ్‌గూడ జులై 15, ప్రభాతవార్త :**
జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 యూసుఫ్‌గూడ ఉప కమిషనర్‌గా జి.రజినీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్ 17 ఖైరతాబాద్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ 19 పరిధిలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది సహాయ సహకారాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు శానిటేషన్ తదితర అంశాలపై దృష్టి సారించామని పేర్కొన్నారు.

### నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలి - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్


తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి, కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డా.టి.కె. శ్రీదేవిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

**దుండిగల్, జూలై 15, ప్రభాతవార్త**
దుండిగల్ మున్సిపాలిటీ పరిధికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి, కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డా.టి.కె. శ్రీదేవిని కలిసి కోరారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి, కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డా.టి.కె. శ్రీదేవిని కలిశారు. ఈ సందర్భంగా ఎన్నో సంవత్సరాల నుండి అభివృద్ధికి వెనుకబడి ఉన్న దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు నాగులూరు డి.పోచంపల్లి, దుండిగల్ అలాగే లంబాడి తాండల అభివృద్ధి, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం డా.టి.కె. శ్రీదేవి సానుకూలంగా స్పందించి దుండిగల్ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్, మాజీ సర్పంచ్ కావలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరిహారం చెల్లించాకే భూములను అప్పగిస్తాం : ఎంపి ఈటల రాజేందర్


కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, బ్రిగేడియర్ రాజీవ్, బోర్డు మెంబర్ బానుక నర్మధ, సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

**కంటోన్మెంట్, జూలై 15 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చి సుందరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ అధ్యక్షుడు, బ్రిగేడియర్ రాజీవ్‌లు సూచించారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశం. బ్రిగేడియర్ ఎస్ రాజీవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్‌ల సమక్షంలో పలు అంశాలపై చర్చించి తీర్మాణించారు. కంటోన్మెంట్‌కు స్వచ్ఛ సర్వేక్షన్ లభించిందని, రాష్ట్ర పతి ద్రౌపతి మూర్ము చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ ప్యాట్నీ జెబిఎస్, మీదుగా శామీర్‌పేట్ వరకు, ప్యారడైజ్, బోయిన్‌పల్లి మీదుగా మేడ్చెల్ వరకు చేపట్టనున్న ఎలివే టెడ్ కారిడార్ కోసం అప్పగించిన కంటోన్మెంట్ బోర్డు భూముల పరిహారంపై వచ్చే డబ్బులు చెల్లించిన తరువాతే రాష్ట్ర ప్రభుత్వానికి భూములు అప్పగిస్తామని బోర్డు తీర్మాణించింది. కంటోన్మెంట్ పరిధిలోని 10 పార్కులలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. రామన్నకుంట చెరువు సుందరీకరణ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు స్వచ్ఛ సర్వేక్షన్ అభివృద్ధితో పాటు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు రావడం సంతోషకరమన్నారు. ఎలివేటెడ్ కారిడార్ స్థలాలకు చెందిన 303 కోట్లు చెల్లించాకే భూములు అప్పగించాలని నిర్ణయించారు. వక్ఫ్‌బోర్డు భూముల సాకుతో భవన నిర్మాణ అనుమతులను నిలిపేయడం సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో పల్లవి విజయ్ వన్షీ, ఛీఫ్ ఇంజనీర్ సి.హెచ్.ఉమా శంకర్, బోర్డు సూపరిడెంట్‌లు హని, బిజెపి నేతలు వంశా తిలక్, బి.ఎన్.శ్రీనివాస్, పిట్ల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

### -సామాజికవేత్త జోసెఫ్ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్, శ్యామ్, సరోజ భాస్కర్, అశోక్ తదితరులు

**హైదరాబాద్, జూలై 15, ప్రభాతవార్త:**
క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా వ్యాఖ్యలు చేసిన రాదా మనోహర్ దాసును తక్షణమే అరెస్టు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త జోసెఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు కలిసి మాట్లాడారు. క్రిస్టియన్ ఆరాధ్య దైవం ఏసుప్రభు బైబిల్ గ్రంథం. తల్లి మరియమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. దీని పై నెలరోజుల క్రితం తమ ఫిర్యాదు మేరకు పోలీసులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఇప్పటివరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాదాకరమన్నారు. సిఎం రేవంత్రెడ్డి, ప్రధాని మోదీ సైతం క్రైస్తవ దైవాన్ని గౌరవించారన్నారు. కానీ, రాదా మనోహర్ దాస్ మాతృమూర్తి అని చూడకుండా అగౌరవంగా మాట్లాడారన్నారు. ప్రజా స్వామ్య దేశంలో ఇలాంటి చీడపురుగులను బహిష్కరించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో తెలంగాణ శ్యామ్, సరోజ బాస్కర్, అశోక్, రహీం బాయ్ పాల్గొన్నారు.

## 42శాతం బిసి రిజర్వేషన్లపై అవసరమైతే న్యాయ పోరాటం : ఆర్.కృష్ణయ్య



**హైదరాబాద్, జూలై 15 ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే అవసరమైతే న్యాయ పోరాటానికి బీసీ న్యాయవాధులు సిద్ధంగా ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో బీసీ రిజర్వేషన్లు, ఆర్డినెన్స్ అమలు, న్యాయపరమైన అంశాలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. బీసీ రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టులకు వెళ్లితే కోర్టుల్లో బలమైన వాదనలు వినిపించాలని ఆయన న్యాయవాదులకు సూచించారు. ఇది బీసీల ఆత్మగౌరవ పోరాటమని, రాజ్యాధికార సాధన కోసం బీసీలందరూ సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఎన్ని పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయం, ధర్మం, చట్టం, రాజ్యాంగ నిబంధనలు అన్ని బీసీలకు అనుకూలంగా ఉన్నాయని, ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే తిప్పికొడతామని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా సుముఖంగానే ఉందని, బీసీల కోసం దేశ జనాభా గణనలో కులగణన చేయడానికి ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ అడ్వొకేట్స్ రమేష్ బాబు, శ్రీనివాస్ యాదవ్, జక్కుల వంశీకృష్ణ, నీలం వెంకటేష్, చెరుకు మణికంత, టి.రాజ్ కుమార్, రాజు నేత, పగిళ్ల సతీష్, మోదీ రాందేవ్, దేవేందర్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓట్లను తొలగిస్తే ప్రజలతో పోరాటం చేస్తాం : మన్నె క్రిశాంక్




**కంటోన్మెంట్, జూలై 15 ప్రభాతవార్త:** రక్షణ శాఖ స్థలాల్లో సంవత్సరాల తరబడి నివాసాలు ఏర్పాటు చేసుకున్న 35 వేల మంది ఓటర్లలో జాబితా లోనుంచి తొలగిస్తే ప్రజలతో కలిసి పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మన్నెక్రిశాంక్ హెచ్చరించారు. 2వ వార్డులోని ఇందిరమ్మ నగర్‌లో బస్తీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, అలాంటి ఓటును తొలగించడం సరైంది కాదన్నారు. రక్షణ శాఖ, ఏయిర్‌పోర్ట్ అథారిటీ భూముల్లో 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారికి విద్యుత్, నీటి బిల్లులు, కరెంట్ బిల్లులు వంటి ఆధారాలు ఉన్నప్పటికి స్థానిక ఎన్నికల్లో ఓటు హక్కును జాబితా నుంచి తొలగించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు యాసిన్, జంగిలి రాజు పాల్గొన్నారు.

### గురు వెంకటేశ్వరరావుకు సంగీత కళాభారతి బిరుదు ప్రదానం

**నాంపల్లి, జూలై 15 ప్రభాతవార్త :** స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని ఘనంగా నిర్వహించిన గురుపూజోత్సవంలో సంస్థలో సంగీత అభ్యసిస్తున్న విద్యార్థులు, గురువుల వద్ద నేర్చుకున్న సంగీతంతో గురుపరంపరకు సంబంధించిన పలు శ్లోకాలు, గీతాలు ఆలపించి తమ గురుభక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంగీత గురువులు పద్మావతి, శారద, ప్రతిభ, రేవతి, ఇందిర, కేశవదాసు, సుబ్రహ్మణ్యం, వీరస్వామి, హరికృష్ణ, ఒబేద్‌లు విద్యార్థులతో సంగీత కచేరి నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత గురువు రాధాకుమారి గురుపరంపర, గురుభక్తి గురించి విద్యార్థులకు వివరించారు. కె.వెంకటేశ్వరరావు గానామృతంతో ఆహుతులను పరవశింపజేశారు. కూడలి వెంకటేశ్వరరావు గురువుగా, గాయకుడుగా చేస్తున్న సంగీత సేవను సంస్థ అధ్యక్షుడు గాదేపల్లి శ్రీనివాస్ ప్రశంసించి ఆయన్ను సంగీత కళాభారతి బిరుదుతో ఘనంగా సత్కరించారు. సంస్థ డైరెక్టర్ సంధ్య, మేనేజర్ ప్రసన్న, దివ్యలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### మానసిక వికలాంగులను అక్కున చేర్చుకోవాలి : ముకుల్


5వ వార్డు వాసవి నగర్‌లో బుద్ధి మాంద్యులకు స్పీచ్ థెరపి పరికరాలను అందజేస్తున్న ఎస్.జి.ఎఫ్.నిర్వాహకులు ముకుల్

**కంటోన్మెంట్, జూలై 15 ప్రభాతవార్త:** మానసిక వికలాంగులను, బుద్ధి మాంద్యులను హక్కున చేర్చుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని శ్రీగణేష్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు ముకుల్ తెలిపారు. ఎస్.జి.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం కంటోన్మెంట్ 5వ వార్డు వాసవి నగర్‌లోని పామెన్, క్యాప్ సంస్థలో పిల్లలకు వినికిడి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఎలాంటి ఇవారికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

I, Smt.N.PADMA W/o. Late NEDUNURI VISWANATHA RAO R/o. Flat No.403, Sita Towers, Street No. 11, Himayathnagar, Hyd. Have Changed My Name From Smt.N.Padma To **Smt.NEDUNURI PADMA** for the Purpose of All Records.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ప్రకటన

నోటీస్ నెం. 07/EOI/EE-30/SD Z/GHMC/2025-2026, తేది : 15.07.2025
[illegible] దాఖలు ముగింపు తేదీ, సమయం: 25.07.2025 మ.12.00గం. [illegible] 7995468066/7331181426. [illegible] https://tender.telangana.gov.in/login.html [illegible]
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-30, బేగంపేట్.
DIPR.NO.5010-PP/CL/ADVT/1/2025-26 తేది: 15.07.2025

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT :: KUSHAIGUDA
O.S.NO. 536 OF 2025

BETWEEN:-
Kavali Samson Sandeep Kumar & 2 Others ...Plaintiffs
AND
1. The Tahsildar, Malkajgiri Mandal, Medchal-Malkajgiri District, Hyderabad.
2. All Concerned. ...Defendants

Please take notice that the above Plaintiffs Kavali Samson Sandeep Kumar and 2 others have instituted the above suit as they are the Legal Heirs of Late Sri Kavali John Basco, you are hereby summoned to appear before this Hon'ble Court in-person or through an advocate on **04.08.2025 at 10.30 A.M.** to answer the same, failing which the case will be decided ex-parte.

// BY ORDER OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT : KUSHAIGUDA//
Sd/-
A. YAGNA PRABHAKARA RAO
ADVOCATE
Plot No.138, Road No.5, Sonia Gandhi Nagar, Kushaiguda, Kapra, Medchal-Malkajgiri District. Pin -500103.

## విస్తృతంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత నమోదు

### : రంగారెడ్డి జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి



శాలివాహన ఆసుపత్రిలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చైర్మన్ నరసింహారెడ్డి, డాక్టర్ సతీష్ తదితరులు

**మలక్ పేట ,జూలై 15, ప్రభాతవార్త:** విస్తృతంగా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ శాలివాహన ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత నమోదు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం తీసుకోవడానికి దిల్ షుక్ నగర్ శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని అందుబాటులో ఉంచుకున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్తలు, యువత సభ్యత్వాలని తీసుకోవాలని కోరారు. రక్తదానం చేసి సమాజానికి తమ వంతు సేవలను అందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శాలివాన ఆసుపత్రి నిర్వహకులు డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మలక్‌పేట వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూర్యప్రసాద్



సమావేశంలో ప్రసంగిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యప్రసాద్

**మలక్ పేట ,జూలై 15, ప్రభాతవార్త:** మలక్ పేట్ నియోజకవర్గం వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు ఎస్. పి. కృష్ణ సూర్య ప్రసాద్ (సూర్యం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మలక్ పేట్ లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక కమిటీని ఆయన ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్. పి. కృష్ణ సూర్య ప్రసాద్, గౌరవాధ్యక్షులుగా రవీందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రవికుమార్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఆకుల దామోదర్, శ్రీకాంత్ యాదవ్, సాయికుమార్, హరీష్ రెడ్డి, అవినాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా డి. లక్ష్మీకాంత్, కోశాధికారిగా జోగు చంద్రసాగర్, కార్యదర్శులు గా టికారం, ముత్యాలు, సంయుక్త కార్యదర్శులు గా మదుసూదన్ రెడ్డి, అనిల్ కుమార్, సలహాదారులుగా మధుసూదన్ ,వెంకట్, కార్యనిర్వ కార్యదర్శిగా దశరథ్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ సర్వర్ , కరీముద్దీన్ ,రాహుల్ కిషోర్ ,కిరణ్ కుమార్ లు ఎన్నికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికైన సూర్యప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## 19న దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో నుంచి ఐదు పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం

### : దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత

**మలక్ పేట ,జూలై 15, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 19వ తేదీ శనివారం ఐదు పుణ్యక్షేత్రాలకు ఒకరోజు టూర్ ప్యాకేజీ తో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ సమత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుంచి మరల ఇంకొక విహారయాత్ర చేయడానికి బస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 19వ తేదీన శనివారం ఉదయం 4 గంటలకు స్వర్ణగిరి, వేయి స్తంభాల ఆలయం, భద్రకాళి ఆలయం, రామప్ప, లక్నవరం తదితర యాత్రలు చేయడం కోసం దిల్ షుక్ నగర్ సిటీ డిపో నుంచి బయలుదేరుతుందని వివరించారు. యాత్ర కోసం మెట్రో డీలక్స్ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్కరికి పెద్దలకు రూ. 1100 రూపాయలు అని, పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 600 రూపాయలు అని తెలిపారు. ఆసక్తిగలవారు దిల్‌షుక్ నగర్ సిటీ డిపో లోని ఫోన్ నెంబర్లు 79899 28321, 9063102132 లలో సంప్రదించాలని పేర్కొన్నారు. బుకింగ్ లు ప్రారంభం అవడం జరిగిందని, వెంటనే ప్రజలు టికేట్లను బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

### తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు : రమేష్ యాదవ్



అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కన్నె రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు

**మలక్ పేట్ ,జూలై 15, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని పవర్ టిల్లర్స్, ఎడ్ల బండి అసోసియేషన్ అధ్యక్షుడు కన్నబోయిన రమేష్ యాదవ్, సలహాదారుడు మల్లేష్ యాదవ్ లు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని వారి ఆధ్వర్యంలో అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని మేళా తాళాలు, పోతరాజుల విన్యాసాలు, శివశత్తుల నృత్యాల నడుమ ఊరేగించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో రామ్ రెడ్డి, మహేష్ యాదవ్, సుధాకర్, యాదయ్య, రమేష్ పాల్గొన్నారు.

## దివంగత రమేష్‌గౌడ్ సేవలు చిరస్మరణీయం



రమేష్‌గౌడ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**సైదాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ మున్సిపాలిటి మాజీ చైర్మన్, లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల రమేష్ గౌడ్ జయంతిని లింగోజిగూడ డివిజన్‌లోని లిబర్టీ చౌరస్తాలో ఆకుల అఖిల్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివంగత రమేష్‌గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటి చైర్మన్‌గా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పేదల అభ్యున్నతి సంక్షేమమే ధ్యేయంగా రమేష్ గౌడ్ తన జీవితాంతం పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వనిపల్లి శ్రీనివాస్, నీల అంజన్, జక్కిడి ప్రభాకర్, రమేష్ యాదవ్, జాజుల ప్రవీణ్, విజయ్ భాస్కర్, కృష్ణారెడ్డి, రాములు గౌడ్, కుమార్, వీర స్వామి, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

## అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**మలక్ పేట ,జూలై 15, ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో అఖిల హైదరాబాద్ హమాలి సంఘం అధ్యక్షుడు కే. సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ ల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాలకు ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలకా నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ఆషాడ, శ్రావణ మాసాలలో జరిగే బోనాలు ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని హమాలీ సంఘం అధ్యక్షుడు కే. సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ లు పేర్కొన్నారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంజరి వినోద్ కుమార్, ట్రేడర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, హమాలి సంఘం వైస్ చైర్మన్ సత్య లింగం , వ్యాపారస్తులు అజయ్ కుమార్, చిక్కా చంద్రమోహన్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం ఉపాధ్యక్షులు పి.కథలయ్య, లక్ష్మణ్, ఏం.రాజు, కోశాధికారి ఎన్.రవీందర్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఎం. కుమార్, డి.రాజు, పి.నర్సింగరావు, కె.మురళి, కార్యనిర్వాహక కార్యదర్శులు బి. శరణప్ప, కుమార్, వెంకటేష్ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నవదుర్గా మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇన్చార్జి ఎస్ జి ఎస్ చిలకా నరసింహారెడ్డి, హమాలీ సంఘం అధ్యక్షుడు కే. సురేష్, ప్రధాన కార్యదర్శి దానం శేఖర్ తదితరులు

## రాజ్యాంగేతర శక్తుల చెప్ప చేతల్లో బడంగ్‌పేట్ కార్పొరేషన్ : శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 15 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో పూర్తిగా అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రాజ్యాంగేతర శక్తులుగా ఉన్న కాంగ్రెస్ నేతల చెప్పు చేతల్లో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అతి త్వరలో బిజెపి తరపున ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రాగానే స్థానిక సంస్థలకు సంబంధించిన మాజీ ప్రజాప్రతినిధులు రాజ్యాంగేతర శక్తులుగా తయారై అధికార యంత్రాన్ని తమ చెప్పు చేతల్లో ఉంచుకున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు తదితర వాటిని కాంగ్రెస్ నేతలే ప్రారంభించడాన్ని గమనిస్తే అధికారులు వారికి ఏ విధంగా కొమ్ముకాస్తున్నారో అర్థమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో కెఎల్‌ఆర్ రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ తదితర విభాగాల అధికారులకు డైరెక్షన్లు ఇస్తూ అనధికార ఆదేశాలు జారీ చేస్తున్నారని శంకర్‌రెడ్డి ఆరోపించారు. అదే విధంగా కింది స్థాయిలో స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ నాయకులు సైతం రాజ్యాంగేత శక్తులుగా మారి అందినకాడికి దోచుకుంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలకవర్గాల పదవీ కాలం ముగిసినా ఇంకా తాము అధికారంలో ఉన్నట్లే మాజీ ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేషన్‌లో భారీ కుంభకోణాలు జరిగాయనీ నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ చలాన్లు సృష్టించి ఇళ్ళ పర్మిషన్ల కుంభకోణం చేశారని ఆయన తెలిపారు. అధికారులు ఇప్పటికైనా తప్పులు చేయకుండా సరిదిద్దుకోవాలని లేని పక్షంలో ఇళ్ళకు పంపించాల్సి వస్తుందని శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు రామిడి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్న రాష్ట్ర బిజెపి నేత కొలన్ శంకర్‌రెడ్డి

## కాంగ్రెస్‌తో కవిత ములాకత్ : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**-త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతుందని జోష్యం**

**-కవిత తొత్తుగా మారిన మేడిపల్లి సీఐ**

**మేడిపల్లి, జూలై 15 ప్రభాతవార్త ;** ప్రభుత్వ పెద్దలపై తీన్మార్ మల్లన్న విమర్శలు, బిసి రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న తనపై కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడి చేస్తే అండగా నిలవాల్సింది పోయి కవితకు మద్దతు తెలుపు తననే విమర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. పీర్జాదిగూడలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... తనపై తెలంగాణ జాగృతి జరిపిన దాడిని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కూడా స్వాగతించలేదు. కానీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఇతర కాంగ్రెస్ పెద్దలు ప్రెస్ మీట్ పెట్టి మరీ కవితకు అండగా నిలిచారని ఇంతకన్నా దరిద్రం ఇంకేం ఉంటుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి కల్వకుంట్ల కవితకు అనధికారిక ఒప్పందం నడుస్తుందని, ఇటీవల ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగినప్పుడే కవిత సైతం మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం ఉండే ఇది నిజమో కాదో కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైందని జోస్యం చెప్పారు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆర్డినెన్స్ రాకంటే ముందే కవిత సంబరాలు చేయడం కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆమెకు అండగా నిలవడం చూస్తుంటే కవిత కాంగ్రెస్ తో మిలాకత్ కావడం అని స్పష్టమవుతుందన్నారు. మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు పని చేస్తున్నాడని, తనపై దాడి జరిగితే తనపైనే కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. సిఐ గోవింద్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిసిపికి ,మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై బీసీ కమిషన్ సైతం స్పందించిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

## బిసి రిజర్వేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలుపుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుందని, ముఖ్యమంత్రి, రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్.కె.పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్‌నేత ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు పరచేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మన్ సురేందర్‌కుమార్, గట్ల రవీందర్, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత, లింగస్వామిగౌడ్, జ్ఞానేశ్వర్‌యాదవ్, యాదవరెడ్డి పగడాల శ్రీశైలం, సందీప్, శ్యాంసుందర్‌గౌడ్, లక్ష్మీ, పెద్దవూర సైదులు, ఢిల్లీ, జగన్నాథం, సంతోష్, సాయి, చిన్నయాదవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్‌లోని దేవాలయాలకు బోనాల చెక్కుల పంపిణీ

**సైదాబాద్, జులై 15 ప్రభాతవార్త:** బోనాల పండుగకు సంబంధించి ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని దేవాలయాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల చెక్కులను కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు హాజరై దేవాలయాల నిర్వాహకులకు చెక్కులు పంపిణీ చేశారు. ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని 223 దేవాలయాలకు సంబంధించి దాదాపు రూ.68 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటి చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బిసిల 42 శాతం రిజర్వేషన్లు ఆటంకం లేకుండా అమలు చేయాలి : సిద్దాల బీరప్ప

**సరూర్‌నగర్, జూలై 15 ప్రభాతవార్త:** కేబినెట్ ఆమోదించిన 42 శాతం బిసి రిజర్వేషన్లకు ఎలాంటి ఆటంకం కలగనీయకుండా అమలు చేయించాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ బిసి నాయకుడు, మీర్‌పేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగపరంగా, కోర్టులలు ఓ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రిజర్వేషన్ల అమలుకు ఎలాంటి అడ్డంకులు కలగకుండా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రత్యేక తీర్మాణం పెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేయాలని ఆయన కోరారు. ఆమోదించిన తీర్మాణాన్ని గవర్నర్, రాష్ట్రపతిల దృష్టికి తీసుకెళ్ళి గెజిట్ చేయించాలని ఆయన తెలిపారు. బిసిలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 42 శాతం బిసి రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళి అమలు చేయాలని బీరప్ప డిమాండ్ చేశారు.

**ఇందిరాపార్కు వద్ద ధర్నాకు తరలిన బిఆర్ఎస్ నేతలు**

కాగా మంగళవారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద బిసిలకు ఎలాంటి ఆటంకం కలగకుండా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసిపిఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు మీర్‌పేట్ కార్పొరేషన్ నుండి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ యాదవ్, ఉయ్యాల నవీన్‌గౌడ్, నాయకులు సిద్దాల బీరప్ప, పల్లె జంగయ్యగౌడ్ సిరూర్ బాలరాజ్, జమాల్‌పూర్ సునీతా బాల్‌రాజ్, కర్రె వెంకటేశ్ కురుమ తదితరులు తరలివెళ్ళారు.

### ప్రతి ఒక్కరూ మొక్కల నాటాలి : కుర్మ సత్తయ్య



**తుర్కయంజాల్ జూలై 15, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి అని డిసిసిబి చైర్మన్ టేస్కాబ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ సత్తయ్య మున్సిపల్ కమీషనర్ కె.అమరేందర్ రెడ్డి తో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాం రెడ్డి, తురుకయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ శివ కుమార్, స్వామి గౌడ్, అయ్యప్ప దేవస్థానం కమిటీ సభ్యులు నర్సింహ, అశోక్ గౌడ్, శ్రవణ్ గౌడ్, పాల్గొన్నారు.

## సౌభాగ్యనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి : లచ్చిరెడ్డి



సౌభాగ్య నగర్‌కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం జూలై.15.ప్రభాతవార్త :** సౌభాగ్యనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సౌభాగ్యనగర్ కాలనీవాసుల పిలుపు మేరకు కార్పొరేటర్ మంగళవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శివారు కాలనీలలో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన తో ఇబ్బందిపడుతున్నామని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు తెలుసుకున్న అనంతరం కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కలనీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు నందకిషోర్, ఆంజనేయులు, ఆదిశేషు, విష్ణు లక్ష్మణ్, విద్యారెడ్డి, వెంకటేశ్వర్లు, జంగారెడ్డి, సుమన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 21న సైదాబాద్ బోనాల జాతర, ఘటం ఊరేగింపు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు సాయి తదితరులు

**సైదాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** జై శ్రీ భవాని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేది సోమవారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వెనక వైపు పూసలబస్తీ వద్ద సైదాబాద్ బోనాల జాతర, ఘటం ఊరేగింపును ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సాయి తెలిపారు. జాతరకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విక్కి, నవీన్, శశి తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి: కార్పొరేటర్**



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎస్‌బిహెచ్ ఏ కాలనీ కమ్యూనిటి హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బ్రిజున్సీసా, ఎంఎంహెచ్ఒ డాక్టర్ రుద్ర శ్రీనివాస్, ఎంటమాలజి హెల్త్ అసిస్టెంట్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఆషాడంలో గోరింటాకు శుభ సూచకం: చిలుక మధుర



మైదాకు దంచుతున్న మధుర ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ శ్రీరామ కృష్ణాపురం కాలనీలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, సరూర్‌నగర్ కోఆపరేటివ్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ ఆవరణలో ఐటిడిఈఎస్ సహకారంతో శ్రీరామకృష్ణాపురంకాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాడమాసం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఆషాడమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం శుభసూచకమన్నారు. ప్రేమకు, శుభానికి ప్రతీకగా నిలిచే గోరింటాకు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల మహిళలలో ఐక్యత పెంపొందిస్తుందన్నారు. గోరింటాకు పెట్టుకోవడం ద్వారా మహిళల్లో ఆనందం, ఆరోగ్యం, ఆయుషు పెంచుతాయని, ఆయుర్వేద వైద్య గ్రంథాలలో నిక్షిప్తమైందన్నారు. ఆషాడమాసంలో మహిళలందరూ తమ ఆరోగ్య పరిరక్షణ కోసం గోరింటాకు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలు నీలిమ, ప్రధాన కార్యదర్శి రాధ, కోశాధికారి విజయలక్ష్మీ, కమిటీ సభ్యులు కోటేశ్వరి, శకుంతల, మాధవి, సరిత, సురేఖ, రాణి, పుష్ప, అర్చన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## రాంచందర్‌రావు నేతృత్వంలో బిజెపి బలోపేతం : సంధ్యారాణి



రామచంద్రరావు సన్మానిస్తున్న సంధ్యారాణి

**ఎల్.బి.నగర్, జులై 15 ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షుడు రామచంద్రరావు నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి మరింత బలోపేతం అవుతుందని పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రావిరాల సంధ్యారాణి పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావుని రాష్ట్ర కార్యాలయంలో సంధ్యారాణి ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందని, తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు కర్నాటి ధనుంజయనేత, రంగారెడ్డి జిల్లా చేనేత సెల్ కన్వీనర్ బొమ్మ రఘురాం నేత, దుస్సా యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఐటి సెల్ కో-ఆర్డినేటర్‌గా రవీందర్



రవీందర్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న కెఎల్‌ఆర్

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఐటి సెల్ కో-ఆర్డినేటర్‌గా బడంగ్‌పేట్‌కు చెందిన చిన్నరావుల రవీందర్ కుమార్ కురుమ నియమితులయ్యారు. ఈ మేరకు తుక్కుగూడలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఐటి విభాగానికి కో-ఆర్డినేటర్‌గా నియమించిన నాయకులకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, భీమిడి చంద్రపాల్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, సూర్ణగంటి విజయ్‌కుమార్, దిండు శ్రీనివాస్‌గౌడ్, మహిళాధ్యక్షురాలు అమృతానాయుడులతో పాటు గొల్లపల్లి కుమార్, ఆదిల్ల జంగయ్య, అరుణ్‌రెడ్డి, రమేష్‌గౌడ్, పద్మశ్రీ పాల్గొన్నారు.

### బాలాపూర్ బోనాలకు రావాలని మహేశ్వరం డిసిపికి ఆహ్వానం



డిసిపి సునీతారెడ్డిని ఆహ్వానించిన బొర్ర రవి, ఇందిర తదితరులు

**సరూర్‌నగర్, జూలై 14 ప్రభాతవార్త:** బాలాపూర్ గ్రామంలో గురువారం జరిగే బోనాల జాతర మహోత్సవంలో పాల్గొనాలని మహేశ్వరం డిసిపి సునీతారెడ్డిని గ్రామానికి చెందిన రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవికుమార్ తదితరులు ఆహ్వానించారు. డిసిపి కార్యాలయంలో సునీతారెడ్డిని పలువురితో కలిసిన రవి ఆమెను మహిళా నాయకురాలు ఇందిరచే సన్మానించి బోనాలకు సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా మహేశ్వరం ఎసిపి జానకీరెడ్డి, బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌లను కూడా సన్మానించి బాలాపూర్ బోనాలకు ఆహ్వానంచారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్కూరి సుధాకర్, ఆనంద్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

### పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్లు ప్రారంభిస్తున్న మాజీ మేయర్ అమర్ సింగ్, పప్పుల అంజిరెడ్డి ,బండి శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి, జూలై 15 ప్రభాతవార్త;**

పీర్జాదిగూడ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో జరుగుతున్న రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి తో కలిసి మాజీ మేయర్ అమర్ సింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ... పనుల నాణ్యత ను పరిశీలించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి శ్రీనివాస్ గౌడ్, హనుమాన్ టెంపుల్ డైరెక్టర్స్ వంగూరి పరమేష్, తావిటి ప్రశాంత్ , కాలనీ వాసులు పాల్గొన్నారు .

## సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్ రాగుల



సిసిరోడ్డు నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగుల.

**వనస్థలిపురం. జూలై.15.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ లోని జైహింద్ బాబు వీధిలో త్వరితగతిన సి.సి. రోడ్డు పనులు పూర్తిచేయాలని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కాలనీ ప్రతినిధులతో కలిసి సి.సి.రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగేటప్పుడు కాలనీకి సంభందించిన డ్రైనేజీ, వాటర్ పైపులైన్లు పగులకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా లెవెల్స్ సరిచేసుకుని ,కాలనీవాసుల కు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే, పరిస్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కొలిశెట్టి సంజయ్ కుమార్, బీరం శ్రీధర్, తడకమల్ల విజయ్ కుమార్, సాయికిరణ్ గౌడ్, జాన్, స్వర్ణ మాధురి, పరమేష్, లక్ష్మణ్, ఇంద్రసేనారెడ్డి ఏ.ఈ. విగ్నేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

### ఘనంగా బోనాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండ్ల ఊరేగింపుకు హాజరైన యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 15 ప్రభాతవార్త:** బాలాపూర్ సాయి నగర్‌లో ఆషాఢ మాస బోనాల పండుగ ఘనంగా జరిగింది. స్థానికులు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. సాయినగర్‌లోని ఈదమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో మహిళలు బోనాలు సమర్పించారు. బోనాల సందర్భంగా స్థానిక యువకులు ఫలహారపు బండి, తొట్టెల ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాను ప్రసాద్, సన్నీ, రాజు, రాజేష్ ఠాకూర్, వినయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.